# నెయ్యి నాణ్యత లేకపోవడం వల్లే లడ్డూలు రుచి తగ్గాయి

**-కల్తీనెయ్యిసరఫరా చేసిన టెండర్లు రద్దు**

**-టిటిడి ఈఓ**



తిరుమల, సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:
దేవదేవుని లడ్డూప్రసాదం తయారీకి టిటిడికి నాణ్యత లేని ఆవునెయ్యి సరఫరా చేయడంతోనే గతంలో లడ్డూల రుచితగ్గాయని టిటిడి ఈఓ జె.శ్యామలరావు తెలిపారు. నాణ్యతలేని, కల్తీనెయ్యి సరఫరాచేస్తున్నట్లు పరీక్షల్లో నిర్ధారణ కావడంతో ఆ టెండర్లను రద్దుచేసినట్లు చెప్పారు. నాణ్యత ఉన్న కర్నాటక నందిని డైరీ నుండి స్వచ్ఛమైన ఆవునెయ్యి ఇప్పుడు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. తిరుమలకు ఇకనుండి నందిని నెయ్యిట్యాంకర్లుద్వారా నెయ్యి సరఫరా అవుతుందన్నారు. బుధవారం ఉదయం తిరుపతిలోని టిటిడి మార్కెటింగ్ గోడౌన్ వద్ద బెంగుళూరుకు చెందిన నందిని నెయ్యి లారీ తిరుమలకు బయలుదేరింది. ఈ సందర్భంగా ఇక్కడ టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓ గౌతమి, సివిఎస్ఓ ఎస్.శ్రీధర్, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, నందిని డైరీ లైజానింగ్ అధికారి మల్లికార్జున్‌రెడ్డితో కలసి వాహనా నికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈఓశ్యామలరావు మాట్లాడుతూ నెయ్యినాణ్యత, రుచిని మెరుగుపరచడానికి టెండర్ షరతులను సవరించామన్నారు. లడ్డూప్రసాదాల తయారీలో వినియోగించే నెయ్యినాణ్యత ఉందనే అంశంపై పరిశీలనకు తిరుమలలో టిటిడి వద్ద ప్రత్యేక పరిశోధనశాల(ల్యాబరేటరీ)లేదని, త్వరలోనే అత్యాధునిక సౌకర్యాలతో దీన్నిఏర్పాటుచేయడానికి చూస్తున్నామని టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్యచౌదరి తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎస్ఓ నందకిశోర్, టిటిడి మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రాథమిక విద్యే విద్యార్థులకు బలమైన పునాది

**- కలెక్టర్ సుమిత్‌కుమార్**



గంగవరం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:
విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ప్రాథమిక విద్యే బలమైన పునాది అని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కల్లుపల్లి పంచాయతీ మల్లేరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సుమిత్‌కుమార్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాప్రమాణాల పెంపుపై శ్రద్ధ చూపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ పెట్టి విద్యార్థుల భవిష్యత్తుకు పెద్దపీట వేస్తోందన్నారు. ఉపాధ్యాయులు బాధ్యతయుతంగా విద్యాబోధన చేసి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర స్టూడెంట్ కిట్లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని, విద్యార్థులు ఈ కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనితో పాటు విద్యాప్రమాణాల పెంపుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థుల మేధస్సును ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు




# గురుకులంలో జిల్లా కలెక్టర్ తనిఖీలు

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త
సూళ్లూరుపేట పట్టణంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో తిరుపతి జిల్లా కలెక్టర్ జి.వెంకటేశ్వర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఇటీవల నాయుడుపేట, అనకాపల్లి గురుకుల పాఠశాలల్లో కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని ఆయన తనిఖీలు చేశారు. ఆయన గురుకుల పాఠశాలలో కోడిగుడ్లు, ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం విద్యా ర్థులతో కూర్చొని సహపంక్తి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ ఆహారం నాణ్యత సంతృప్తి కరంగా ఉందని, వంటగదిలో మాత్రం కొంత పరిశుభ్రత పాటించాల్సిన అవసరం ఉందని చెప్పారు. గురుకుల పాఠశాలలో పారిశుధ్యం మెరుగుపరుచుకోవడంతో పాటు మంచినీటి వసతిని కూడా కల్పించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఏఓ రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ చైతన్య, మున్సిపాలిటీ మేనేజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.










# కాళంగి గేట్లను త్వరితంగా పూర్తి చేయండి

**రిజర్వాయర్‌ను పరిశీలించిన కలెక్టర్**

**పిచ్చిమొక్కలతో పంట పొలాలు మునిగిపోతున్నాయి: రైతుల మొర**



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త
'వర్షాలు ఎప్పుడు వస్తాయో? ఎప్పుడు వరదలు ముంచుకొస్తాయో? అంతుపట్టని పరిస్థితి చోటు చేసుకుంది. కాళంగి రిజర్వాయర్‌కు రెండు రోజులు వర్షం వస్తే నిండిపోతుందని చెబుతున్నారు. మరి ఇప్పటి వరకు గేట్లు మరమ్మత్తులు ఎందుకు చేయలేదు? మూడేళ్ళ క్రితం గేట్లు కొట్టుకుపోతే ఎందుకు మరమ్మత్తులు చేయలేదని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ ప్రశ్నించారు. బుధవారం సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి కలెక్టర్ ఇరిగేషన్ ఎస్ఇ మదనగోపాల్, ఆర్‌డిఓ రవిశంకర్ంరెడ్డి, ఇరిగేషన్‌అధికారులతో కలసి పరిశీలించారు. ముఖ్యంగా తెలుగుగంగ కాలువలు, తిరుపతికి సాగునీరందించే రిజర్వాయర్‌ను కలెక్టర్ పరిశీలించారు. ప్రకృతి బీభత్సాన్ని గుర్తించిన ఆయన ముందు జాగ్రత్తగా ప్రాజెక్టులను పరిశీలించారు.

**కాళంగి గేట్ల మరమ్మత్తులు త్వరగా చేపట్టండి:**

బుచ్చినాయుడు కండ్రగలోని14 చెరువులు, కెవిబిపురం మండలంలోని 7 గ్రామాల్లో అధికారికంగా 4500 ఎకరాలకు సాగునీందించే కాళంగి రిజర్వాయర్ గేట్లు 2021లో భారీ వర్షాలకు వరద తాకిడికి కొట్టుకుపోయాయి. ఇన్ని రోజులు ఎందుకు పట్టించుకోలేదని కలెక్టర్ వెంకటేశ్వరన్ ఇరిగేషన్ అధికారులకు ప్రశ్నించారు. ఇఇ మదనగోపాల్ సమాధానం ఇస్తూ గేట్లు మరమ్మత్తులకు ఇటీవల రూ.10లక్షలు మంజూరైందని టెండర్లు పిలిచామన్నారు. త్వరలో పూర్తి చేస్తామన్నారు. అలాగే కాళంగి రిజర్వాయర్‌కు సంబంధించి 2021లో రూ.48కోట్లతో ప్రతిపాదనలు పంపామని వివరించారు. నిదులు మంజూరు కాలేదన్నారు. ఈ సందర్భంగా కాళంగి రిజర్వాయర్ పరిధిలోని రైతులు కలెక్టర్‌ను కలసి తమ బాధలను వివరించారు. కాళంగినదిలో పిచ్చిమొక్కలు పెరిగి నీరు ప్రవాహానికి అడ్డంకిగా మారిందని దాంతో ప్రతి ఏడాది వర్షాకాలం పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా నవంబర్ మాసంలో తాము కాళంగి నది ఉధృతంగా ప్రవహించి తమ పంట పొలాలపై దాడి చేసి ఇసుక మేటలు వేస్తుందని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాలువలు, నదిలో పిచ్చిమొక్కలు తొలగించుటకు నిధులు ఎంత కావాలని కలెక్టర్ ఎస్ఇని ప్రశ్నించగా అంచనాలు తయారు చేయిస్తామని వివరించారు. కాగా అక్కడ నుంచి జిల్లా కలెక్టర్ తిరుపతికి మంచినీటిని అందించే తెలుగుగంగ ఆఫ్‌టేక్ పాయింట్‌ను, అలాగే శ్రీకాళహస్తికి సమీపంలోని కో కా కోలా సంస్థకు నీటిని అందించేఆఫ్‌టేక్ పాయింట్లను కలెక్టర్ పరిశీలించారు. ఇటీవల కేరళ, రాష్ట్రంలోని విజయవాడ సంఘటనలను గుర్తించిన కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను అప్రమత్తం చేసారు. చెరువులకు సంబంధించి ఇబ్బంది ఉంటే వెంటనే అంచనాలు తయారు చేయాలని మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. కలెక్టర్‌తో పాటు తెలుగుగంగ ఎస్ఇ మదనగోపాల్, ఆర్‌డిఓ రవిశంకర్‌రెడ్డి, డిఇఇ ఆదినారాయణ, తహశీల్దార్ దస్తగిరియ్య ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# మట్టి గణపతికి జై - పర్యావరణ సంరక్షణకు సై

**- పోస్టర్లను విడుదల చేసిన జాయింట్ కలెక్టర్**



చిత్తూరు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:
మట్టి గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణంను సంరక్షించాలని జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఎపి కాలుష్య నియంత్రణ మండలి తరపున తయారు చేసిన మట్టి గణపతికి జై-పర్యావరణ పరిరక్షణకు సై అనే పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పర్యావరణంను సంరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరు మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను పూజించాలన్నారు.




# చిత్తూరు బంగారు భవిష్యత్తుకు

**ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు బాటలు**



చిత్తూరు అభివృద్ధికి ఇప్పటి వరకు జరిగింది ఒక ఎత్తు అయితే ఇకపై జరిగేది మరో ఎత్తు అని తెలుగుదేశం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు నిరూపిస్తున్నారు. తండ్రి చెన్నకేశవులునాయుడు నుండి సేవాగుణం, కష్టపడేతత్వంను పుణికిపుచ్చుకున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు చిత్తూరు బంగారు భవిష్యత్తు కోసం కంకణం కట్టుకుని ముందడుగు వేస్తున్నారు. చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించిన ఎమ్మెల్యే కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు తొలి అడుగు వేసి స్థలం ఎంపిక చేసి పూర్తి చేశారు. సిఎం నారా చంద్రబాబునాయుడు పేదల ఆకలి తీర్చడానికి రాష్ట్ర వ్యాప్తంగా గతంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను పునరుద్ధరించాలని ఆదేశించడంతో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు రాష్ట్రంలోని మొదటిగా చిత్తూరులో అన్న క్యాంటీన్‌ను పునరుద్ధరించారు. నియోజకవర్గ పరిధిలో మరిన్ని అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యే కసరత్తు చేస్తున్నారు. చిత్తూరు నగర సుందరీకరణ చర్యల్లో భాగంగా గంగినేని చెరువు, కట్టమంచి చెరువులను అభివృద్ధి చేసి చెరువు పరిసరాల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పడానికి శ్రీకారం చుట్టారు. చెరువుల వద్ద మహనీయుల విగ్రహాల ఏర్పాటుతో పాటు గంగినేని పార్కులో సొంత నిధులతో హాల్ నిర్మాణానికి హామీ ఇచ్చారు. మామిడి రైతు కష్టాలను చూసిన ఎమ్మెల్యే గురజాల కలెక్టర్‌తో చర్చించి రైతులు కోరిన మేరకే ధర చెల్లించేలా మామిడి పండ్ల గుజ్జు పరిశ్రమల యాజమానులతో చర్చించి రైతుకు గిట్టుబాటు ధర అందేలా చేశారు. జనంలో జిజెఎం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అధికారులతో కలిసి అనునిత్యం ప్రజల వద్దకు వెళ్ళి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తుపెట్టుకుని మంచినీరు, పారిశుధ్యం, వీధి కాలువలు, సిమెంటు రోడ్లు తదితరాల సమస్యలను పరిష్కరించడానికి పూపుకుంటున్నారు. ప్రతి నెలా ఒకటవ తేదీ తెల్లవారుజాము నియోజకవర్గ పరిధిలోని అవ్వా తాతలకు స్వయంగా వెళ్ళి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఎమ్మెల్యే అందిస్తున్నారు. చిత్తూరు భవిష్యత్తు ఉజ్వలంగా వుండాలంటే తనతో పాటు



మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం ఏకం కావాలని నిర్ణయించి ఎమ్మెల్యే గురజాల రాజకీయ వ్యూహంను అమలు చేసి మేయర్, వైకాపా కార్పొరేటర్లను తమ వైపు ఆకర్షించుకుని కార్పొరేషన్‌పై తెలుగుదేశం జెండాను ఎగురవేశారు. చిత్తూరు రైతు బజారును పూర్తి స్థాయిలో ఆధునీకరించి అక్కడ విక్రయాలు చేస్తున్న డ్వాక్రా మహిళలకు తన సొంత నిధులతో అద్దెలు చెల్లిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గత వైకాపా ప్రభుత్వంలో సామాన్యులకు ఇసుక అందకపోవడంతో తెలుగుదేశం ప్రభుత్వం ఉచిత ఇసుక హామీ మేరకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి చిత్తూరు రూరల్ మండలం ముట్టుకూరు, దిగువమాసాపల్లి రీచ్‌ల నుండి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేయడానికి శ్రీకారం చుట్టారు. ప్రశాంత్ నగర్‌లో ముస్లీం సోదరుల పవిత్ర ప్రార్ధనల కోసం ఈద్గా నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించానికి ప్రతి గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రతి గురువారం ఉదయం 10 నుండి 11 గంటల వరకు డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి సమస్యలను స్వీకరించి వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో మంచినీటి సమస్యను పరిష్కరించడానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఇప్పటి వరకు 15 బోర్లను డ్రిల్ చేసి ప్రజలకు నీటి కష్టాలను తీర్చారు. నియోజకవర్గ పరిధిలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి రీయూసబుల్ బ్యాగుల తయారీ సంస్థ ప్రతినిధులతో బెంగళూరులో సమావేశమై చిత్తూరు పరిసరాల్లో పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరారు.







**అర్టీసీ ఉపాధ్యక్షుడిగా వుండి చేయలేని పని చేసి శభాష్ అన్పించుకున్న ఎమ్మెల్యే గురజాల:**

అర్టీసీ ఉపాధ్యక్షుడిగా విధులు నిర్వర్తించి చేయలేని పనిని ఎమ్మెల్యేగా ఎన్నికైన 50 రోజుల్లో గురజాల జగన్మోహన్‌నాయుడు చిత్తూరు-2 డిపో నుండి బస్సులు లేని వివిధ ప్రాంతాలకు 9 నూతన బస్సులను ప్రారంభించారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంలో చిత్తూరు రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని నినాదం పుణికిపుచ్చు కున్న ఎమ్మెల్యే ఎలక్ట్రిక్ వాహనాల వినియో గంపై చిత్తూరు ప్రజలకు అవగాహన కల్పించడానికి ఎలక్ట్రిక్ వాహనాల ర్యాలీని నిర్వహించారు.



**జిజెఎం ట్రస్ట్ తరపున పలు సేవాకార్యక్రమాలు:**

ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులకు రూ.5లక్షల రూపాయలతో 10వేల బస్సుపాసులు, వినాయకచవితిని పురస్కరించుకొని రూ.30లక్షలతో మట్టివిగ్రహాలు పంపిణీ, సంక్రాంతి, దీపావళి వంటి పర్వదినాలను పురస్కరించుకొని పార్టీ కార్యకర్తలకు, అసంఘటిత కార్మికులకు టపాసులు, కొత్తబట్టలు పంపిణీ, నిరుపేదవిద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థికసాయం, క్రీడలను ప్రోత్సహించడానికి పలు పోటీలను నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేయడం, వీధి వ్యాపారులకు తోపుడుబండ్లు, క్రిస్మస్‌ను పురస్కరించుకొని నియోజకవర్గ వ్యాప్తంగా ఫాదర్, క్రైస్తవ కుటుంబాలకు క్రిస్మస్‌కానుకలు.

# సోమలలో డ్రగ్స్ కలకలం

సోమల, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త
సోమల మండలంలో డ్రగ్స్ వాడకం యువతలో ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజుల్లోనే ఇద్దరు యువకులు డ్రగ్స్ మత్తులో మృతి చెందడం చర్చనీయాంశం అయినది. గత ఏడాదికాలంగా బస్టాండ్‌లోని కొంతమంది యువకులు గంజాయి సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరు నంజంపేట, పెద్ద ఉప్పరపల్లి పరిసర ప్రాంతాలకు సప్లై చేస్తున్నట్లు తెలిసింది. ముఖ్యంగా 14 సంవత్సరాల నుంచి 20 సంవత్సరాల మధ్య ఉన్న యువతీ యువకులు గంజాయికి అలవాటు పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. నంజంపేటలో 30 శాతం యువత గంజాయికి బానిసగా మారాలంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మత్తులో పడిన యువకులు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. అటవీ సమీప ప్రాంతాల్లో గంజాయి విరివిగా సాగు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత అధికారులు ఇకనైనా పూర్తిస్థాయిలో దృష్టిపెడితే కొంతవరకైనా అరికట్టవచ్చు.

# వి.కోటలో హిందు..ముస్లిం సోదరుల శాంతి ర్యాలీ



వి.కోట, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త
జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు అధ్వర్యంలో బుధవారం సాయంత్రం వి.కోటలో హిందు ముస్లిం సోదరులు శాంతి ర్యాలీ నిర్వహించారు. వి.కోట పట్టణంలో అన్ని మతాల ప్రజలు సోదర భావంతో కలసిమెలసి జీవించాలని మత సామరస్యాన్ని పాటించాలని ఈసందర్భంగా తీర్మానించారు. హిందు ముస్లిం భాయిభాయి అంటూ అంటూ నినాదాలతో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, నేతలు రామచంద్రనాయుడు, రంగనాథ్, బాలగురునాథ్, విజయ్, ఇక్బాల్, గౌస్, రూహుల్లా, జాకీర్, సలాంసాబ్, ఆఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వండి

**-ధర్మగిరివేదపాఠశాలలో అదనపు ఈఓ చౌదరి**

తిరుమల, సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:
వేదఘోషతో, వేదవిద్యార్థులతో సందడిగా ఉండే ధర్మగిరిలోని వేదపాఠశాల ప్రాంగణం పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన వేదపాఠశాలను సందర్శించారు. ఇక్కడ వేదవిద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. పలు అంశాలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి సిఇ సత్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ అవధాని, వింగ్ విఎస్ఓ ఎన్టీవి రామ్‌కుమార్ పాల్గొన్నారు.








## గర్భిణులక్కు పక్కాగా వైద్య సేవలు

**యాదమరి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** గర్భవతులకు సకాలంలో అవసరమైన వైద్య సేవలను పక్కాగా అందించాలని యాదమరి పిహెచ్‌సి సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ ఆదేశించారు. యాదమరి పిహెచ్‌సి పరిధిలోని దసరాపల్లి సబ్‌సెంటర్ పరిధిలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మాతా శిశు మరణాలు తగ్గించడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వ్యాధి నిరోధక టీకాలను నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి సుస్మిత, మహిళా ఆరోగ్య కార్యకర్త ప్రియకుమారి, ఆశాలు, గర్భవతులు పాల్గొన్నారు.

## విస్తృతంగా మొక్కలు పెంచడమే వన మహోత్సవం లక్ష్యం

**చిత్తూరు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు పెంచి పచ్చదనంను పెంపొందించి అడవులను సంరక్షించి భవిష్యత్తు తరాలకు సుస్థిర వాతావరణం కల్పించాలని డ్వామా పిడి రాజశేఖర్ పిలుపునిచ్చారు. వన మహోత్సవం-2024 కార్యక్రమంలో భాగంగా డ్వామా పిడి రాజశేఖర్ బుధవారం చిత్తూరు, గంగాధరనెల్లూరుల్లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంకు శ్రీకారం చుట్టారు. డ్వామా పిడి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుండి మొక్కలు నాటి వాటిని పెంచడంలో ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో జిడినెల్లూరు డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ దమయంతి, అదనపు ప్రోగ్రాం అధికారి శ్రీనివాసులు, జూనియర్ ఇంజనీర్ ఈశ్వరమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరు ఎంపిక



**పాలసముద్రం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా మండలం నుండి వనదుర్గాపురం ఎంపియుపి పాఠశాల హెడ్మాస్టర్ ఇ.కోదండయ్య, టివిఎన్‌ఆర్‌పురం ఎంపిపి పాఠశాల హెడ్మాస్టర్ జమునా రాణిలు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని గురువారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో జరిగే గురుపూజోత్సవం కార్యక్రమంలో సన్మానించనున్నట్లు ఎంఇఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జమునారాణి, ఇ.కోదండయ్యలను ఎంఇఓ రాజేంద్రప్రసాద్ అభినందించారు.

## వరద బాధితుల సహాయార్థం వెళ్ళిన 71 మంది పారిశుధ్య కార్మికులు

**చిత్తూరు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:**

విజయవాడ పరిసర ప్రాంతాల్లో సంభవించిన వరదల వల్ల సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకొని అక్కడ పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించి విజయవాడ నగరంను తిరిగి యధా స్థితికి తీసుకురావడానికి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ నుండి 71 మంది పారిశుధ్య కార్మికులు విజయవాడ తరలివెళ్ళారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టడం కోసం చిత్తూరు నుండి నలుగురు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు, నలుగురు మేస్త్రీలు, 63 మంది పారిశుధ్య కార్మికులు మంగళవారం రాత్రి ప్రత్యేక బస్సుల్లో విజయవాడకు బయలుదేరారు. మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు పారిశుధ్య కార్మికులకు అవసరమైన సామాగ్రిని సమకూర్చి వారికి దిశా నిర్దేశం చేసి విజయవాడకు పంపారు. బుధవారం విజయవాడ చేరుకున్న పారిశుధ్య కార్మికులు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, కమీషనర్ నరసింహ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో రామలింగేశ్వరకట్ట, పోలీస్ కాలనీల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. వరద కారణంగా పేరుకుపోయిన బురద మట్టిని తొలగిస్తూ శుభ్రతా పనులు చేపడుతున్నారు. దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లడం, దోమలు విజృంభించకుండా స్ప్రేయింగ్, ఫాగింగ్ పనులు ముమ్మరంగా చేపడుతున్నారు.

## ఐఐఎంకు ఎస్‌ఆర్‌పురం విద్యార్థిని ఎంపిక

**శ్రీరంగరాజపురం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ఎన్‌ఎన్‌డి పురం గ్రామానికి చెందిన జల్లా చంద్రశేఖర్‌రెడ్డి కుమార్తె సోహనరెడ్డి దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, బెంగళూరు నందు బిబిఎ(డిజిటల్ బిజినెస్ అండ్ ఎంట్రీప్రినర్షిప్) కోర్సుకు ఎంపికయ్యారు. మారుమూల గ్రామం నుండి ఐఐఎంలో సీటు సంపాదించడం ద్వారా సోహనరెడ్డిని తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

## వరద బాధితులకు రూ.30 లక్షల నిత్యావసర సరుకులు

**చిత్తూరు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:**

విజయవాడ వరద బాధితులకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జిజెఎం చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని సంస్థ కార్యాలయం నుండి 30 లక్షల రూపాయల విలువైన నిత్యవసర వస్తువులను పంపించారు. ఈ నిత్యావసర వస్తువుల సరుకుల లారీని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు తండ్రి జిజెఎం చారిటబుల్ ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. అలాగే వరద బాధితులను ఆదుకోవడానికి సిఎం రిలీఫ్‌ఫండ్‌కు రూ.10 లక్షలు విరాళం అందజేసిన వారికి ఎమ్మెల్యే తండ్రి గురజాల చెన్నకేశవులునాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల సౌకర్యార్థం గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు



– ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కుప్పం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఉర్ల ఓబనపల్లి, వరమనూరు, గట్టప్పనాయనపల్లి, పరమసముద్రం, అమరావతి కాలనీ మీదుగా కుప్పం వరకు ఆర్టీసీ బస్సు సర్వీసును ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత వైకాపా పాలనలో కుప్పం డిపో బస్సులను పుంగనూరు, ఇతర డిపోలకు తరలించుకున్నారన్నారు. తెదేపా ప్రభుత్వం అధికారంలో రాగానే ఆ బస్సులను వెనక్కు రప్పించి ప్రజల అవసరార్థం గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, నేతలు మహేంద్ర, సత్యేంద్రశేఖర్, ఇఆర్‌బి బాలాజీ,సుబ్బు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

**కుప్పంరూరల్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త** రైతుల ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ కోరారు. బుధవారం వ్యవసాయశాఖచే రైతులకు ప్రభుత్వం తరపున రాయితీ ఉలవల పంపిణీ ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 870రూ.ల విలువ చేసే పది కిలోల నాణ్యమైన ఉలవల బస్తాను ప్రభుత్వం రూ 174లకు అందించడం జరుగుతోందన్నారు. ప్రభుత్వ పథకాలను నేతలు రైతులకు వివరించి వారు లబ్ది పొందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎఒఅమృతవల్లి,ఎఇఒ ఔరంగ్, నేతలు రాధాకృష్ణమూర్తి, దామోదరం, మేఘనాథ్, భూపతి పాల్గొన్నారు.

## సోషియల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవు



**వి.కోట, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త** జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో వి.కోట పట్టణంలో పరిస్థితి అదుపులో ఉందని పలమనేరు డిఎస్పీ ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కొందరు పనిగట్టుకుని సోషియల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు పోస్ట్ చేస్తున్నారని ఇలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి వదంతులను ప్రజలు నమ్మరాదన్నారు. ప్రజలు అన్నదమ్ముల్లా కలసి ఉన్నారని ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడితే సహించేది లేదని స్పష్టం చేశారు. పట్టణంలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. పరిస్థితి ప్రశాంతంగా ఉంటే రేపటి నుంచి సాధారణ జన జీవనం కొనసాగేలా ఉన్నతాధికారులతోచర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. సిఐ సోమశేఖర్‌రెడ్డి, ఎస్సై బాబు పాల్గొన్నారు.

## 500 లీటర్ల సారా ఊట ధ్వంసం

**సదుం సెప్టెంబరు 4 ప్రభాతవార్త** మండల పరిధిలోని గాదేవారిపల్లె అటవీ పరిధిలో బుధవారం సదుం పోలీసులు ఎస్సై షేక్షావలి ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాలలో అటవీ ప్రాంతంలోని పొదలలో దాచి ఉంచిన దాదాపు 500 లీటర్ల సారా ఊట నిల్వలను గుర్తించి వాటిని ధ్వంసం చేశారు. రైటర్ మురళి సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటగా ఉలవలు వేసుకోండి

**రొంపిచెర్ల సెప్టెంబరు 4 ప్రభాతవార్త** వేరు సెనగ విత్తని రైతులు ప్రత్యామ్నాయ పంటగా ఉలవలను వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుధారాణి తెలిపారు. బుధవారం రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లె సచివాలయం వద్ద ఉలవల విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు పాసుపుస్తకాన్ని, ఆధార్‌కార్డును తీసుకువచ్చి ఉలవలు తీసుకు వెళ్లాలన్నారు. రైతు సేవా కేంద్రాలలో 80 శాతం రాయితీపై వీటిని అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. విత్తనాలు తప్పనిసరిగా విత్తుకోవాలని అధిక దిగుబడి సాధించి మంచి లాభాలు వస్తాయని చెప్పారు.

## రైతు సంక్షేమమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యం



**శాంతిపురం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త** రైతు సంక్షేమమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం రాళ్లబూదుగూరులో ప్రభుత్వం తరపున రైతులకు రాయితీ ఉలవల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో వ్యవసాయ అభివృద్ధికి సిఎం చంద్రబాబు ఆదేశాలతో తగు ప్రణాళికలు రూపొందించామన్నారు. వ్యవసాయాన్ని పండగలా చేయడమే తమ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో కడ పిడి వికాస్ మర్మత్, ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, సర్పంచులు లక్ష్మి మురుగేష్, బాలకృష్ణ, మహిళా నేతలు అనసూయ, సుగుణమ్మ, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

**రామకుప్పం :** మండలంలోని బందార్లపల్లిలో బుధవారం రైతులకు ప్రభుత్వం తరపున రాయితీ ఉలవలను తెదేపా నేతలు పంపిణీ చేశారు. అనంతరం గురుకులపాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు చిన్నికృష్ణ,చలపతి, రామూర్తి, నందారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, దయా, నియాజ్, బాలరాజు, సుబ్రి, వెంకటరమణ, నవీన్ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## టూవీలర్ పార్కింగ్ సౌకర్యం కల్పించండి



**పాకాల, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త** పాకాల ఆర్టీసి బస్ స్టేషన్‌లో టూవీలర్ వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేయవలెనని స్థానికులు కోరుతున్నారు. మండలంలో నలుమూలల నుంచి తిరుపతి, చిత్తూరు, చెన్నై, బెంగళూరు లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్ళు ప్రయాణికులకు సరైన వాహన పార్కింగ్ సౌకర్యం లేనందువలన చాలా ఇబ్బంది పడుతున్నారు. స్థానిక ఏపిఎస్ ఆర్టీసి వారు బస్‌స్టేషన్ ఆవరణలో ఎన్నో సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉండే షాప్స్ స్థానంలో టూ వీలర్ పార్కింగ్ ఏర్పాటు చేయవల్సిందిగా ప్రయాణికులు కోరుతున్నారు. ఆర్టీసి వారికి షాపులలో రాని ఆదాయం టూవీలర్ పార్కింగ్ సదుపాయంతో సమకూర్చుకోవచ్చునని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## ప్రతి ఒక్కరు సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలి

**చిత్తూరురూరల్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:**



భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరు చురుగ్గా పాల్గొని అందరి చేత సభ్యత్వం చేయించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌నాయుడు పేర్కొన్నారు. బుధవారం జిల్లా బిజెపి కార్యాల యంలో జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎన్‌పి వెంకటేశ్వరచౌదరి, దుర్గా రామక్రిష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు అట్లూరిశ్రీనివాసులు, వెంకటముని, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రమోహన్, మణివర్మ, జిల్లా కార్యదర్శి చిట్టిబాబు, జాతీయ కౌన్సిల్‌సభ్యులు రాజేంద్రన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబు,ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు రవికుమార్, అసెంబ్లీ కన్వీనర్లు మోహన్‌నాయుడు, భానుప్రకాష్, మండల అధ్యక్షులు షణ్ముగం, సురేష్, ఉదయ్, శివ తదితరులు పాల్గొన్నారు.

## పాము కాటుకు వ్యక్తి మృతి



**చౌడేపల్లి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**

పాము కాటుకు వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలంలోని చారాల పంచాయతీ కురపల్లికి చెందిన రెడ్డెప్ప(30) దర్జీగా జీవిస్తున్నాడు. ఈక్రమంలో బుధవారం తెల్లవారు జామున ఇంట్లో నిద్రిస్తున్న అతన్ని విషసర్పం కాటేసింది. అపస్మాకర స్థితిలో పడివున్న అతన్ని కుటుంబ సభ్యులు పుంగనూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రెడ్డెప్ప మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అక్కడికే తరలించారు.

## వ్యాధులు రాకముందే జాగ్రత్తలు తీసుకోవాలి : డాక్టర్ నవీన్



**చౌడేపల్లి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త** అంటువ్యాధులు సోకక ముందే జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి నవీన్‌తేజ్‌రాయల్ అన్నారు. స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కాలానుగుణ వ్యాధులపట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు.అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసారు. సూపర్‌వైజర్ బాహుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

## 108లో ఇఎంటి సేవలకు దరఖాస్తుల ఆహ్వానం

**చౌడేపల్లి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**

108 సేవలను మరింతగా విస్తరింప చేయడానికి ఖాళీగా వున్న ఇఎంటి పోస్టులకు ధరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మేనేజర్ మోహనబాబు తెలిపారు. చిత్తూరు జిల్లా పరిధిలోని చౌడేపల్లి, సోమల, సదుం, పులిచర్ల, రొంపిచర్ల మండలాల్లో పోస్టులు ఖాళీగా వున్నాయన్నారు. ఇఎంటి పోస్టులకు అభ్య ర్థులు బీఎస్సీ నర్సింగ్, లైఫ్‌సైన్స్, జీఎన్‌ఎం(ఎంఎల్‌టి 5సంవత్సరాల అనుభవం) చదివినవారు అర్హుల న్నారు. ఈనెల 15లోపు చిత్తూరు 108 కార్యాలయంలో బయోడేటాలను అందించాలనీ, మరిన్ని వివరా లకు 9502214614నంబరును సంప్రదించాల్నారు.

## ప్రధాన రహదారిలో ఆక్రమణదారులకు నోటీసులు

**కుప్పం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త** కుప్పం పట్టణంలోని ప్రధాన రహదారి నేతాజీ రోడ్డులో ఆక్రమణదారులకు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు నోటీసులు జారీ చేశారు. ప్రధాన రహదారిలో పలు దుకాణాల యజమానులు స్థలాలు ఆక్రమించుకోవడంతో పాటు నిర్మాణాలు చేపట్టారని నోటీసులు అందిన పదిహేనురోజుల్లోగా తమతంట తామే స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకోవాలని ఆదేశించారు. అలాగే పట్టణంలోపలుచోట్లరోడ్లకుఅడ్డంగాఉన్నబ్యానర్లు, వ్యాపార ప్రకటనలు సైతం తొలగించాలని సూచించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వినాయకుడి విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

**వెంకటగిరి, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త**

ఈ నెల ఏడవ తేది వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని వెంకటగిరి సిఐ ఏ. వెంకట్రావు తెలిపారు. వెంకటగిరిలోని సిఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మైకులు, డిజేలు పెట్టేవారు ప్రభుత్వానికి చలానా కట్టాలని చెప్పారు. వినాయక చవితి సందర్భంగా అల్లర్లకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. భక్తి శ్రద్ధలతో వినాయక చవితిని జరుపుకోవాలని ఆయన తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ఫుట్పాత్ మీద నాలుగు చక్రాలు బండ్లు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగే విధంగా పెట్టరాదని సూచించారు.

## యువకుడు వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

**గూడూరు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త**



గూడూరు పట్టణంలోని అశోక్ నగర్ ప్రాంతానికి చెందిన బత్తల రాజా అనే యువకుడు అనారోగ్యం పాలవడంతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో వైద్యం చేయించారు. వైద్య పరీక్షలు నిర్వహించి అతనికి రెండు కిడ్నీలు చెడిపోయాయని వైద్యులు తెలిపారు. వారం రోజులుగా అక్కడే వైద్యం చేయించగా వారి వద్ద ఉన్న డబ్బులు అయిపోవడంతో ఇంటికి వచ్చేసారు. వాడిది నిరుపేద కుటుంబం కావడంతో రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థా పకులు రాజనేని శ్రీనివాసులు నాయుడును సంప్రదించగా రాజా వైద్య ఖర్చుల కోసం 10 వేల రూపాయిలను ట్రస్ట్ సభ్యులైన అమరయ్య నాయుడు, బాబు, భాస్కర్ల ద్వారా బాధితుని తల్లి మల్లెమ్మకు అందజేశారు.

## ఎమ్మెల్యే సునీల్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు

**గూడూరు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త**



ఎన్డీఏ కూటమి గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌ని విమర్శించే స్థాయి ఎమ్మెల్సీ మేరిగ మురళికి లేదని జనసేన పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు అన్నారు. గూడూరు జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గూడూరులో నివాసం ఉంటూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్న సునీల్ కుమార్ పై విమర్శలు తగదన్నారు. ప్రజల కోసం పని చేసే వారిని విమర్శించే ముందు మీ పరిస్థితి ఏమిటో తెలుసుకోవాలన్నారు. ఎమ్మెల్సీగా ఉండి గూడూరు అభివృద్ధికి మేరిగ మురళి ఏమి చేసారో ప్రజలకు తెలుసు కాబట్టే కూటమి అభ్యర్థి సునీల్ కుమార్‌ను ప్రజలు గెలిపించారన్నారు. ఇకనైనా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలని హితవు పలికారు. పిటిసి మోహన్, లీగల్ సెల్ సుమన్, పట్టణ కార్యదర్శులు సాయి కిరణ్, సనత్, చిల్లకూరు నాయకులు మనోజ్ కుమార్, ఓంకార్, వంశీ, తిరుపాలు, సాయి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు ఒకటవ పట్టణ, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లను

**గూడూరు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త**



ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలలో భాగంగా బదిలీ అయి బాధ్యతలు చేపట్టిన గూడూరు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శేఖర్ బాబుని, గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ బాబుని గూడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, ఆయా స్టేషన్‌ల పరిధిలోని పలు సమస్యలను సర్కిల్ ఇన్స్‌పెక్టర్ల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, మాజీ కౌన్సిలర్, తిరుపతి పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు తాతపూడి ఇశ్రాయేల్ కుమార్, గూడూరు నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండి అబ్దుల్ రహీం, గూడూరు పట్టణ ఉపాధ్యక్షుడు అరికట్ల మస్తాన్ నాయుడు, గూడూరు పట్టణ కోశాధికారి తక్కెళ్ళపాటి చంద్రమౌళి, గూడూరు పట్టణ ఎస్సి సెల్ అధ్యక్షుడు పల్లి కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఇసుక అందరికీ అందుబాటులోకి తెస్తాం

ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్



**గూడూరు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త** గూడూరులో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు బుధవారం ఉచిత ఇసుక పై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్‌ని ఇసుక అందుబాటులో లేకపోవడంతో కార్మికులు నానా ఇబ్బందులకు గురి అవుతూ పస్తులు ఉండాల్సిన పరిస్థితి కొనసాగుతూ ఉందని, ఇతర ప్రాంతాలలో ఇసుక అందుబాటులో ఉంటూ ఉందని ఒక్క గూడూరు డివిజన్‌లో మాత్రమే ఇసుక అందుబాటులోకి రావడం లేదని పై విషయమై ఆర్డీవో ఎం. కిరణ్ కుమార్, అలాగే ఎమ్మార్వోని పలుదపాలు కలిపి ఉచిత ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని పలుదపాలు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని, వారు పొంతన లేని సమాధానాలు చెప్పి దాటవేస్తుండడంతో, పనులు లేక ఇంటి బాడుగలు కట్టలేక, పిల్లలను చదివించుకోలేక, నానా ఇబ్బందులకి గురి అవుతున్నామని, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వెంటనే ఎమ్మెల్యే డాక్టర్. పాశం సునీల్ కుమార్ స్పందిస్తూ ఉచిత ఇసుక అందరికీ అందుబాటులోకి త్వరలో తీసుకువస్తామని భరోసా కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ సీనియర్ నాయకులు పుట్టా శంకరయ్య, ఎస్‌డి రఫీ, సేలం శేఖరాచారి, గూడూరు పట్టణ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, గూడూరు పట్టణ సిఐటియు నాయకులు బివి రమణయ్య, ఎస్. సురేష్, నాయకులు అడపాల ప్రసాద్, బల్లవోలు నారాయణ, జిలాని భాష, అబ్దుల్లా మేస్త్రీ, బండి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాసవీ క్లబ్‌చే వృద్ధులకు రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ

**సూళ్లూరుపేట, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



సూళ్లూరుపేటలోని వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో వాసవీ క్లబ్ అంతర్జాతీయ వాసవీ వారంలో భాగంగా బుధవారం బాపూజీకాలనీలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ వాసవీ క్లబ్‌కు చెందిన బండారు శబరీష్, సాయిరాం, సునీత, గుర్రం ప్రసాద్, సౌజన్య, వృద్ధాశ్రమం నిర్వాహకులు మస్తాన్, బాబులు పాల్గొన్నారు.

## తడ మండల ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

**తడ, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తడ మండలంలోని ముగ్గురు టీచర్లను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మండల పరిధిలోని కాదలూరులో పనిచేస్తున్న శ్రీనివాసులు, చేనిగుంట జిసిలో పనిచేస్తున్న పి.శైలజ, పకీరుకండ్రిగలో పనిచేస్తున్న ఎస్‌కె రుక్సానాలను మండల విద్యాశాఖ తరపున బుధవారం అభినందించారు. టీచర్స్‌డే సందర్భంగా తడ ఎంపిడిఓ కార్యాలయంలో వీరిని సత్కరిస్తామని పేర్కొన్నారు.

## సుందరపురంలో బీరువా వితరణ

**తడ, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభిమానులు బుధవారం తడ మండలం సుందరపురం ఎంపిపి పాఠశాలకు బీరువాను వితరణ చేశారు. ఉపాధ్యాయులు పాల్గొనగా, పవన్ కల్యాణ్ అభి మానులు వెంకటరమణ,భాస్కర్,బాబు,నిశ్వంత్‌నాని,హేమంత్,దామోదర్‌లుఈబీరువానుకొనిపాఠశాలకుబహూకరించారు.

## మినుము ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చు

**వెంకటగిరి, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త**

మినుము పంట ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రంలో రబి మినుము సాగు, సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ పల్లాకు తెగులు తట్టుకొని అధిక దిగుబడినిచ్చే పాలిష్ వున్నా లావు గింజ రకం అని తెలియజేశారు. మినుము సాగులో విత్తనశుద్ధి, పోషక యాజమాన్యం, కలుపు యాజమన్యాం, పురుగులు, తెగుళ్ల యాజమాన్యం గురించి రైతులకు శాస్త్రవేత్త రాజీవన వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులకు టిబిజి 129 రకం విత్తనం, రైజోబియం జీవన ఎరువు రైతులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలోశాస్త్రవేత్తలునాగార్జున రెడ్డి, విజయశ్రీ, తిరుపాల్, టీవీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## తాజా కూరగాయల్లో పోషక విలువలు : సిడిపివో

**గూడూరు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త** తాజా కూరగాయల్లో పోషక విలువలు ఉంటాయని తల్లులు, గర్భవతులు అలాంటి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సిడిపివో మెహబూబి సూచించారు. గూడూరు పట్టణంలోని వెలుగు కార్యాలయంలో పట్టణం, గ్రామీణ మండలానికి సంబంధించి పోషకాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో పోషకాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణ, గ్రామీణ మండలానికి సంబంధించిన గర్భవతులకు ఘనంగా సీమంతాలు నిర్వహించారు. సాంప్రదాయ బద్ధంగా సీమంతాలను ఐసిడిఎస్ అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ సిడిపిఓ జ్యోతి కిరణ్, వెలుగు అధికారిణిబుజ్జమ్మ,సూపర్‌వైజర్లుస్వరూపారాణి, చెంచులక్ష్మి, హైమావతి రేణుక, శివజ్యోతి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

**కోట, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కోటలోని బిసి గురుకులంలో మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఇఓ మస్తానయ్య ప్రారంభించారు. మ్యూజికల్ ఛైర్, పరుగుపందెం, షాట్‌పుట్ తదితర క్రీడలు నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహిస్తున్న నేపథ్యంలో అదేరోజు ఆయాపాఠశాలల్లోనిప్రధానోపాధ్యాయులచేత బహుమతులు అందజేస్తారని ఎంఇఓ మస్తానయ్య తెలిపారు.

## వరద బాధితులకు సహాయ కార్యక్రమాలు

**పెళ్లకూరు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



విజయవాడ ప్రాంతంలో వరద నేపథ్యంలో ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం ముమ్మకంగా కృషి చేస్తోంది. స్వయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజలకు అందిస్తున్న ఆహారం, ఇతర ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. అధికారులు ఆలస్యం చేయకుండా వరద బాధితులకు సహాయ సహకారాలు అందించాలని ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అధికారులను విజయవాడ ప్రాంతంలో సహాయ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో బాధితులకు సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని ఆధ్వర్యంలో గత మూడురోజులుగా సహాయ కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. వరద ముంపు ప్రాంతాల్లో పెళ్లకూరు తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, వీఆర్‌ఓ బూదనం రమేష్‌లు ఆర్డీఓతో కలిసి గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ఆహార పదార్థాలు, మంచినీరు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు.

## నిబద్ధత కలిగిన ఉద్యోగిగా ఎంపిడివో వెంకటేశ్వరరావు

**వాకాడు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త**



మంచికి పేరు, అందరి మనల్ని పొందిన వాకాడు ఇన్చార్జి ఎంపిడివో వెంకటేశ్వరరావు నిబద్ధత కలిగిన ఉద్యోగిగా పేరు తెచ్చుకున్నాడని తహశీల్దార్ రామయ్య అన్నారు. బుధవారం కోటలోని ఏఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఇన్చార్జి ఎంపిడిఓ వెంకటేశ్వరరావుకు స్వచ్ఛంద పదవి విరమణ సందర్భంగా మండల స్థాయి సిబ్బంది ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన కొడవలూరు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ 33 సంవత్సరం కాలంలో వాకాడులో 12 నెలలు ఈవోపీఆర్డిగా, ఇన్చార్జి ఎంపిడివోగా పనిచేసి మండలంలోని ఉద్యోగిగా ప్రతి ఒక్కరి మన్నలను పొందారన్నారు. తహశీల్దార్ రామయ్య మాట్లాడుతూ తనకు తక్కువ సమయంలో పరిచయమైన ఎంపిడివో వెంకటేశ్వర రావు ఆయన దగ్గర ఎన్నో విషయాలు తెలుసుకున్నామన్నారు. గూడూరు డిఎల్‌పిఓ వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధన ప్రకారం ఉద్యోగం చేస్తూ ఎలాంటి రిమార్కులు లేకుండా పనిచేశారన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ మధు రెడ్డి, బిజెపి గూడూరు నియోజకవర్గ కన్వీనర్ పాపా రెడ్డి పురుషోత్తం రెడ్డి, కోట ఎంపిడివో భవాని, మాజీ ఎంపిడివో గోపినాథ్, సందీప్ కుమార్, ఎంఈవో నసీం అలీ, డిపిఓ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివ వరప్రసాద్, విశ్రాంతి ఉద్యోగి మెహరాలి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంపిడిఓ వెంకటేశ్వర రావుకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

## పదోన్నతిపై ఏఎస్ఐ శ్రీనివాస్ బదిలీ

**వాకాడు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త**



వాకాడు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ శ్రీనివాస్ పదోన్నతులపై బదిలీ అయ్యారు. బుధవారం వాకాడు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ నాగబాబు ఆధ్వర్యంలో ఏఎస్ఐ శ్రీనివాస్‌కు ఘన సన్మానం చేసారు. ఏఎస్ఐ శ్రీనివాస్‌కు పలువురు శాలువా కప్పి పూల మాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండల బిజేపి అధ్యక్షులు వల్లి ప్రసాద్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎక్కడ రాజీ పడకుండా ఏఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి పని చేశారన్నారు. ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ సబ్ ఇన్స్పెక్టర్‌గా ప్రమోషన్ మీద వెళ్తున్నారన్నారు.

## తుఫాను బాధితులకు ఆహార ప్యాకెట్లు సరఫరా చేసిన ఎమ్మెల్యే కురుగొండ్ల

**వెంకటగిరి, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త**



విజయవాడలోని సింగ్ నగర్‌లో తుఫాన్ వల్ల నిరాశ్రయులైన వారికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పార్టీ నాయకులు ఆహారాన్ని సరఫరా చేశారు. తుఫాన్ వల్ల అపార నష్టం జరిగిందని ఆయన ఆందోళన చెందారు. సిఎం చంద్రబాబు నాయుడు పరిపాలన దక్షుడు అయినందువల్ల తుఫాను బాధితులకు ఇబ్బంది లేకుండా తగు సహాయ చర్యలు నాయకులు అధికార యంత్రం ద్వారా అందించినట్లు తెలిపారు. తుఫాను బాధితులు అందరికీ తగు సహాయ సహకారాలు మంత్రులు, అధికారులు నాయకులు అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వర రావు, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రమౌళి రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, నాయకులు సత్యనారాయణ, రాయి సత్యం నాయుడు, ఆనంద్, పాల్గొన్నారు.

## విఘ్నేశ్వర స్వామి ఆలయంలో కుంభాభిషేకం



**విజయపురం, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** మండలంలోని పన్నూరులో విఘ్నేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం కలశపూజ, యాగశాల పూజ, కలశ పూజలు, తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమం నిర్వహించారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ విఘ్నేశ్వర స్వామి సేవలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు బాలసుబ్రహ్మణ్యశర్మ, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉప కార్మిక కమీషనర్‌గా ఓంకార్ రావ్ బాధ్యతలు స్వీకరణ



**తిరుపతిరూరల్, సెప్టెంబర్04 ప్రభాతవార్త:** తిరుపతి ఉప కార్మిక కమీషనర్‌గా కె.ఓంకార్ రావ్ పూర్తి అదనపు బాధ్యతలను బుధవారం చేట్టారు. ఇదివరకు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న మదనపల్లి సహాయ కార్మిక కమీషనర్ డి.వి.రంగరాజు మదనపల్లికి వెళ్ళడంతో ఓంకార్ రావ్‌కు పూర్తి అదనపు బాధ్యతలను కార్మిక కమీషనర్ అప్పగించారు.

## వరదబాధితులకు తెలుగుయువత సేవలు



**తిరుపతి,సెప్టెంబర్ 4(ప్రభాతవార్త:** విజయవాడనగరం పరిసరాల్లో వరదల్లో చిక్కుకున్న బాధితులకు తమవంతు సాయంగా తెలుగుయువత నేతలు ముందుకు కదిలారు. సిఎం చంద్రబాబునాయుడు ,మంత్రి నారాలోకేష్ పిలుపుతో తెలుగుయువత రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎ.రవినాయుడు, జయ శంకర్, నాగూర్, వెంకట్రావు, శ్రీధర్ దాదాపు 50మంది వరకు వాలంటీర్లు స్వచ్ఛందంగా విజయవాడకు చేరుకున్నారు. అక్కడ వీరంతా వరదల్లో నీటిలో చిక్కుకున్న కుటుంబాలను కలిసి వారికి అవసరమైన భోజనం, బిస్కెట్లు, నీళ్ళసీసాలు, ఇతరత్రా వాటిని సింగ్‌నగర్, వాంబేనగర్, వైఎస్‌ఆర్ కాలనీ,తూర్పు నియోజకవర్గంలో ప్రజలకు చేరుస్తున్నారు. బాధితులకు అండగా తెలుగుయువత కదలిరావడంతో అక్కడ బాధితులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## ప్రజలకు అసౌకర్యంగా వినాయక విగ్రహాలను పెట్టొద్దు



**తిరుపతి,సెప్టెంబర్ 4(ప్రభాతవార్త:** పుణ్యక్షేత్రం, యాత్రా స్థలం తిరుపతిలో ప్రజలకు అసౌకర్యం కలిగించేలా వినాయకవిగ్రహాలను నడిరోడ్డుపై పెట్టొద్దని వరసిద్దివినాయక మహోత్సవ కమిటీ ఆదేశించింది, ఆయా కాలనీల్లో, ప్రాంతాల్లో కమిటీలు నిర్దేశించిన చోట వినాయకవిగ్రహాలను ఏర్పాటుచేయాలన్నారు. విగ్రహాలు ఏర్పాటు, మండపాలు నిర్వహణ, నిమజ్జనం వరకు శాంతియుతంగా, ప్రశాంతవాతావరణంలో ఉండేలా చూసుకోవాలన్నారు. నిబంధనల కరపత్రాలను బుధవారం కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, నవీన్‌కుమార్‌రెడ్డి, డిఎస్పీలు వెంకటనారాయణ, రామకృష్ణమాచారి, కమిటీ సభ్యులు గుండాల గోపీనాథరెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, ఆర్‌సి మునికృష్ణ, భాస్కర్‌నాయుడు, ఎస్వీఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ఉన్నతాధికారులతో భద్రత సదస్సు



**తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త** తిరుపతి రైల్వే స్టేషన్‌లో బుధవారం మధుసూదన్ రైల్వే ఇన్స్పెక్టర్ రైల్వే భద్రత గురించి చర్చించుటకై ఇంటిలిజెన్స్, బాంబు డిటెక్షన్, డిస్పోజల్, లా అండ్ ఆర్డర్, ఇతర పోలీస్ విభాగాలకు సంబంధించిన ఉన్నతాధికారులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రవి మనోహరాచారి అడిషనల్ ఎస్పి శిరీష, డిసిఐఓఐబి తిరుపతి, బాంబు డిస్పోజల్, లా అండ్ ఆర్డర్, ఇతర స్పెషల్ ఇంటెలిజెన్స్ విభాగాలకు సంబంధించిన డిఎస్పిలు, ఇన్స్పెక్టర్లు ఇతర సిబ్బంది హాజరైయ్యారు. ఈ సమావేశంలో భారతదేశంలో స్లీపర్ సెల్స్‌ను ఉత్తేజపరుస్తూ, రైల్వే విభాగానికి, భారతదేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం చూకూరాలని వివిధ టెర్రరిస్ట్ సమూహాల నుండి వస్తున్న ఇంటెలిజెన్స్ నివేదికల మీద చర్చించారు. రైల్వే ఇన్స్పెక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ రైల్వే విభాగంలో ఎటువంటి విధ్వంసకర, హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అందుకు అన్ని విభాగాల సహాయ సహకారాలు కావాలని కోరారు. ఎడిషనల్ ఎస్పి రవి మనోహరాచారి మాట్లాడుతూ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అది వారి బాధ్యతని తెలిపారు. తిరుపతి రైల్వేలో ప్రమాదకర పరిస్థితులను నివారించడానికి అన్ని స్థాయిలలో పరస్పర సమాచారం, సన్నిహితం అవసరమని తెలిపారు.

## భక్తితో వినాయకపూజలు చేసుకుందాం



**తిరుపతి,సెప్టెంబర్ 4(ప్రభాతవార్త:** తిరుపతిలో భక్తితో వినాయకపూజలు జరుపుకునేందుకు అవసరమైన వ్రతకల్పం పుస్తకాన్ని సీనియర్ జర్నలిస్ట్ గుండ్రాజు సుకుమార్‌రాజు ప్రచురించారు. ఈ పుస్తకాన్ని బుధవారం ఉదయం కెకెలేట్‌లోని వరసిద్దివినాయకస్వామి ఆలయంలో ఆవిష్కరించారు. ఉచితంగా భక్తులకు, నగరవాసులకు గత ఎనిమిదేళ్ళుగా అందిస్తున్నట్లు సుకుమార్ తెలిపారు. ఈ పారిశ్రామికవేత్త కిలారి రూపేంద్రనాయుడు, తిరుపతి మానవతాశాఖ ఛైర్మన్ నందప్పగారి బార్గవ, అధ్యక్షుడు సివి రమణ, సభ్యులు పి.వేణుగోపాల్, జయపాల్, పరామనందరాజు, నీరజ పాల్గొన్నారు.

## భక్తులకు మెరుగైన సేవలు



**తిరుపతి,సెప్టెంబర్ 4(ప్రభాతవార్త:** రానున్న బ్రహ్మోత్సవాల్లో తిరుమల ఘాట్‌లో సురక్షిత ప్రయాణం అవసరమని, ఆర్టీసి ఆ దిశగా చర్యలు తీసుకుని బస్సులను నిదానంగా,జాగ్రత్తగా నడపాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరి సూచించారు. బ్రహ్మోత్సవాల్లో ఆర్టీసి బస్సుల నిర్వహణ, సురక్షిత ప్రయాణం, భక్తులను గమ్యస్థానాలకు చేర్చడంపై తిరుపతి ఆర్టీసి ఆర్ఎం చెంగల్‌రెడ్డితో చర్చించారు. ఈ సందర్భంగా ఆర్ఎం అదనపు ఈఓ చౌదరిని దుశ్శాలువతో సత్కరించారు.

## ఎర్రచందనం దుంగలు స్వాధీనం -ఇద్దరు అరెస్ట్



**సత్యవేడు, సెప్టెంబర్ 04, ప్రభాతవార్త:** సత్యవేడు అటవీప్రాంతంలో 19 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులుఇద్దరు స్మగ్లర్స్‌ను అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్సు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి టీమ్ మంగళవారం రాత్రి సత్యవేడు సమీపంలోని బీరకుప్పం ఫారెస్ట్ సెక్షన్ ఎస్కె మడుగు వద్ద కూంబింగ్ చేపట్టారు. బుధవారం ఇక్కడఅటవీప్రాంతంలోని భూపతేశ్వరకోన వద్ద ఎర్రచందనం దుంగలనుమోసుకుని వెళ్తున్న వారిని టాస్క్‌ఫోర్సు పోలీసులు గుర్తించారు. వారిని వెంబడించగా ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు, మిగిలిన వారు పరారయినట్లు వారు తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి వారిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్ స్టేషన్‌కు తరలించనట్లు వారు పోలీసులు తెలిపారు.

## శ్రీకాళహస్తి మున్సిపాలిటిని అభివృద్ధి పథంలో నడిపిన కమిషనర్



**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాన్ని రెండు సార్లు నియమించిన కమిషనర్ ఎం.రమేష్‌బాబు సేవలు అనిర్వచనీయమని బుధవారం సన్మాన కార్యక్రమంలో పలువురు ప్రశంసించారు. పట్టణంలోని కొత్తపేటలో ఉన్న ఓ కాంప్లెక్సులో ఆయనకు సన్మాన కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. పలువురు వక్తలు మాట్లాడుతూ అభివృద్దిలోనూ, సేవలందించటంలోనూ రమేష్‌బాబు ముందువరుసలో నిలిచారన్నారు.పురపాలకసంఘంలో ఓ చిన్నపాటి సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరించే అధికారి అన్నారు.ముఖ్యంగా మున్సిపల్ పరిధిలోని లైటింగ్ శానిటేషన్ విషయంలో ఆయన చొరవ ఎంతో ప్రశంసనీయం అన్నారు.పట్టణంలో జరిగే పెద్ద పండగలు జాతర,మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలని ఆ సమయంలో కమిషనర్ రమేష్‌బాబు చొరవ తీసుకొని రేయింబవళ్లు ఉంటూ ఉత్సవాల వెనుకే పరిశుభ్రతను నిర్వహించారన్నారు. మంచినీటి సరఫరాలో ఆయన ఎప్పటికప్పుడు పరిశీలించుకుంటూ నీటి ఎద్దడిని నివారించారన్నారు. ఈ కార్యక్రమాల్లో కె.భరత్‌రెడ్డి, జ్యోతిరావు, చంద్రమౌళి, పఠాన్ ఫరీద్‌ఖాన్, చంద్రబాబు,రమణారెడ్డి, రమేష్, వంశీ, తింబ,మగదీప్,వినోద్, ఇమ్రాన్, చిట్టిబాబు, బాలాజి, వెంకటరావు, నవీన్,శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బదిలి అయిన కమిషనర్‌ను దుశ్శాలవతో సత్కరించారు. తన సేవలు గుర్తించిన యువకులకు ధన్యవాదాలు తెలిపారు.

## కుస్తీ పోటీల్లో శ్రీ పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థినిల ప్రతిభ

**తిరుపతి విద్య,సెప్టెంబర్ 4,ప్రభాతవార్త:** గత నెల ఆగస్టు 25వ తేదీ నుంచి రెండు రోజులపాటు రేణిగుంటజిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర గ్రాప్లింగ్ సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలు జరిగాయి సబ్ జూనియర్ మరియు సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు తిరుపతి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన శ్రీ పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థినిలు రెండు విభాగాల్లో పాల్గొని 7 బంగారు పతకాలు 12 కాంస్య పథకాలు 16 రజిత పథకాలు సాధించి తిరుపతి జిల్లాకు ఛాంపియన్ షిప్ రావడానికి ప్రధాన కారణమయ్యారు.వీరి లో బంగారు పథకాలు సాధించిన విద్యార్థినిలు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు.ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ మొదటి వారంలో హర్యాన రాష్ట్రం రోహతక్ లో జరుగు జాతీయ గ్రాప్లింగ్,రెజ్లింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకి ప్రాతినిధ్యం వహించనున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి భువనేశ్వరి విద్యార్థినిలను అభినందించి ఒక ప్రకటనలో వెలువరించారు.వీరికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ సాయి సుమతిని ప్రిన్సిపాల్ మరియు అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.పతకాలు సాధించిన విద్యార్థినిలు:డి రిజ్వాన్-గోల్డ్,ఇ.సంజన-గోల్డ్,పి చైత్ర,గోల్డ్ ఎం నీలవవేణి,గోల్డ్ ఈ సౌమ్య,గోల్డ్ ఎం నిత్యశ్రీ గోల్డ్ సి శివ పండు,గోల్డ్ సి జాహ్నవి,కే అమ్ములు,శ్రీ శైలజ,వి పావని,ఎస్ అమృత,ఎంధాత్రిమొగధారమ్మ,రెడ్డి కౌసల్య,పీ తనుజ,జి ప్రసన్న,కే పావని,ఎం లక్ష్మీదేవి,ఎం అశ్విని,జి కోటేశ్వరి,డి జస్మిత,డి.స్ఫూర్తి.ఈ అభినందన సభలో ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బోనుపల్లిలో విద్యుత్ సమస్యలపై సమీక్ష



**తొట్టంబేడు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త** మండలంలోని బోనుపల్లి సబ్‌స్టేషన్ నందు విద్యుత్ సరఫరా విద్యుత్ శాఖ ఏఈ బాలాజీ రైతులకు అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 33/11కెవి విద్యుత్‌సబ్‌స్టేషన్‌లో 11కెవి ఫీడర్లు విద్యుత్ అంతరాయానికి గల కారణాలను వాటి నివారణ చర్యలు గురించి తెలిపారు. విద్యుత్ ప్రమాదాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అంతరాయాలకు సంబందించి రైతులు సహకరించాలని కోరారు. రైతులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మొత్తం 15 సమస్యలపై వినతిపత్రం ఇచ్చారని వీటిఇలో 12 సమస్యలను పరిష్కరించామని 3 వినతులు ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో విద్యుత్‌శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గణిత ఉపాధ్యాయుడికి ఉత్తమ జిల్లా అవార్డు



.తొట్టంబేడు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త

మండలంలోని గుండేలిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కందాటి మునీశ్వర్‌రెడ్డికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కింది. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతిలోని జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోనున్నారు. ఈసందర్భంగా మునీశ్వర్‌రెడ్డిని పలువురు అభినందించారు.

## శ్రీకాళహస్తిలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండల విద్యాశాఖలో నలుగురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైనట్లు ఎంఈఓలు భువనేశ్వరి, బాలయ్యలు తెలిపారు. వీరిలో పట్టణంలోని సరస్వతీ బాయి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇంగ్లీష్ అసిస్టెంట్ కొత్తపల్లి. వెంకటాద్రి, వేడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్‌టీచర్‌గా పనిచేస్తున్న జిపి.చలం, ముచ్చివోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో బయాలజీ టీచర్‌గా పనిచేస్తున్న డి.నరసింహయ్య, ఇక తొండమనాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.కృష్ణయ్యలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈసందర్భంగా వీరు నేడు జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో కలెక్టర్ చేతులమీదుగా అవార్డును అందుకోనున్నారు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



**తొట్టంబేడు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త** పౌష్టికాహారంతోనే చిన్నారులు, గర్భవతులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి అన్నారు. మండలంలోని తంగేళ్ళపాళెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ రాజేశ్వరి మాట్లాడుతూ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పంపిణీచేసే పౌష్టికాహారాన్ని గర్భవతులు, బాలింతలుకు రక్తహీనత రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు గుడ్లూరుమోహన్‌కిషోర్‌నాయుడు, అంగన్‌వాడీ కార్యకర్తలు జి.భారతీ, ఎం.పద్మావతి, కె.మంజుల, ఎం.మోహనరాణి, సి.మణెమ్మ, టి.లక్ష్మి, అంగన్‌వాడీ సహాయకురాలు రాజేశ్వరి, తేజోవతి, గర్భవతులు, బాలింతలు, చిన్నారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వినాయక చవితి వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరణ

శ్రీకాళహస్తి రూరల్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోని గాంధీ వీధిలో వెలసిన జ్ఞాన సిద్ది వినాయక ఆలయం ప్రసిద్ది చెందింది. ప్రతి ఏడాది ఇక్కడి వినాయక చవితి సందర్భంగా వారోత్సవాలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో ఈ ఏడాది కూడా ఉత్సవాలు నిర్వహణకు ప్రణాళిక రూపొందించుకున్నారు. ఈ ఉత్సవాల పోస్టర్లను బుధవారం ఊరందూరు గ్రామంలోని ఎంఎల్ఏ స్వగృహంలో పోస్టర్లను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బృందమ్మ ఆవిష్కరించారు. ఇక్కడ ఉత్సవాలను ఈ నెల 7 నుంచి 13వరకు జరపబడుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యుడు కాసరం రమేష్, టౌన్‌బ్యాంకు మాజీ సభ్యులు బాలు ఢిల్లిబాబు, కమిటి సభ్యులు ఎం.సుధాకర్, కోరా రమేష్, వివేక్ గౌడ్, నవీన్‌రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడకు శ్రీకాళహస్తి పోలీసులు:

**శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**ఆంధ్ర రాష్ట్రంలో మహావిపత్తు చోటు చేసుకుంది. రాజధాని నగరానికి సమీపంలో విజయవాడ పట్టణంలో వరద బీభత్సం సృషించింది. ఊహాలకు అందని రీతిలో పట్టణాన్ని జలగండం ఆవరించింది. దాంతో పరిస్థితి నాలుగు రోజులైనా కుదుట పడలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సహాయక కార్యక్రమాలను అందించుటకు శ్రీకాళహస్తి నుంచి కూడా పోలీసులను తరలించారు. శ్రీకాళహస్తి సబ్‌డివిజన్‌లోని ఐదు పోలీసు స్టేషన్ల నుంచి 20మంది సిబ్బందిని పంపినట్లు డివైయస్‌పి నరసింహామూర్తి వివరించారు.

## ఆత్మ విశ్వాసంతో చేస్తే ఏ పనిలో అయినా ఫలితం సాధిస్తారు

రేణిగుంట, సెప్టెంబరు 4 ప్రభాతవార్త: ఆత్మ విశ్వాసంతో చేస్తే ఏ పనిలోనైనా ఫలితాలు సాధిస్తారని పనిలో నాణ్యతను బట్టి ఫలితాలు ఉంటాయని ప్రముఖ సైకాలజిస్ట్ డా. ఎన్.బి.సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతి రాస్‌ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులకు భగవద్గీత శ్లోకాల్లో మానసిక కోణాలపై అవగాహన కల్పించారు. సామర్థ్యం, జ్ఞానం, చురుకుదనం, నైపుణ్యం ఉన్న వారికి ఉత్తమ ఫలితాలు చేకూరుతఆయని, వృత్తి నైపుణ్యాలతో పాటు సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఆధ్యాత్మిక వికాసం అవసరమన్నారు. ప్రతికూల భావాలు, సామర్థ్య లోపాలు ఒత్తిళ్ళకు మూలాలుగా మారుతాయన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ వి.నాగరాజు, అధికారులు బాలాజీరెడ్డి, రవి, నాగేశ్వరరావు, వికాస నిపుణుడు చంద్రమౌళి, ప్రభాకర్‌శెట్టి, అన్ని బ్రాంచీల ఉద్యోగులు పాల్గొన్నారు.

## రైల్వే ఆస్తులు భారత ఆర్థిక వ్యవస్థకు మూలాలు



**రేణిగుంట, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** భారతదేశంలోని రైల్వే ఆస్తులు భారత ఆర్థిక వ్యవస్థకు మూలాలని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తిరుపతి అడిషనల్ ఎస్పీ రవి మనోహర్ ఆచారి అన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్‌ల్లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ మధుసూదన్ పిలుపు మేరకు తిరుపతి రైల్వేస్టేషన్‌లో బుధవారం భద్రతా సదస్సు జరిగింది. సదస్సులో ఇంటిలిజెన్స్, బాంబు డిటెక్షన్ డిస్పోజబుల్, లా ఆర్డర్, ఇతర పోలీసు విభాగాలకు సంబంధించిన ఉన్నతాధికారులతో విస్తృ స్థాయి చర్చ జరిగింది. ఈ సందర్భంగా రవి మనోహర్ ఆచారి మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక మూలాలను నష్ట పరచడానికి వివిధ టెర్రరిస్ట్ సమూహాలు విపరీతంగా ప్రయత్నిస్తున్నాయని ఇంటెలిజెన్స్ వర్గాల హెచ్చరికల మేరకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ ఆహ్వానించడం, వల్ల సదస్సులో పాల్గొంటున్నట్లు తెలిపారు. గంజాయి, ఇతర మాధక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా జరగకుండా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ శిరీష, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఎంఈవో హెన్రీ భాస్కర్ కుటుంబ సభ్యులను పరామర్శించి రోజా



**పుత్తూరురూరల్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** పుత్తూరు మున్సిపాలిటీ గేటు పుత్తూరులో రిటైర్డ్ ఎంఈవో హెన్రీ భాస్కర్ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి రోజా బుధవారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమెతో పాటు వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పుత్తూరు పట్టణంలో వైసీపీ నాయకుడు రమణను మాజీ మంత్రి రోజా పరామర్శించారు. అనారోగ్యంతో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న రమణను ఆయన స్వగృహంలో పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పుత్తూరు రూరల్ మండలం వేపగుంట వైసీపీ నాయకుడు సుదర్శన్‌ని మాజీ మంత్రి రోజా పరామర్శించారు. అనారోగ్యంతో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న సుదర్శనంను ఆయన స్వగృహంలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వేపగుంట వైసీపీ నాయకులు జైకుమార్ దంపతులను పరామర్శించారు.

## ప్రాథమిక పాఠశాల విద్యాభ్యాసనతోనే విద్యార్థి విద్య భవిష్యత్ ఆధారపడి ఉంటుంది - ఎంఈవో

బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:



పునాది ప్రతిష్టంగా ఉంటే ఏదైనా నాణ్యతగా ఉంటుందని, విద్యార్థులకు ప్రాథమిక పాఠశాల దశలో విద్యాభ్యాసన పూర్తి స్థాయిలో నేర్పించ కలిగితే వారి విద్య భవిష్యత్ ఎదుగుదలకు దోహద పడుతుందని ఎంఈవో సుబ్రహ్మణ్యం ప్రాథమిక పాఠశాల పర్యటనలు ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాల, నైనేరి కండ్రిగ పాఠశాలలో ఆయన పర్యటించి విద్యార్థుల సామర్థ్యం భోజనం వసతులు గురించి తనిఖీ చేశారు. ఇప్పటి వరకు సెమ్‌వన్ సిలబస్‌పై విద్యార్థులతో స్వయంగా ప్రశ్నల ద్వారా ప్రగతిని తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీసి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి మన బిడ్డలతో సమానం మన బిడ్డలను ఎలా ఉన్నత స్థాయిలో చూడాలనుకుంటున్నామని, అలాగే ప్రతి విద్యార్థిపై శ్రద్ధ వహించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన మన అందరిపై ఉందన్నారు.

# తిరుపతి డివిజన్

## 22న తిరుపతి నుండి విశాఖపట్నం వరకు రథయాత్ర

ఆదివారాహిశక్తి టెంపుల్ ట్రస్ట్ పిలుపు



**తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త** తిరుచానూరులోని శ్రీ ఆదివారాహి శక్తి టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేది తిరుపతి నుండి 28వ తేదీ విశాఖ పట్నం వరకు శ్రీ వారాహి మహా రథ యాత్ర కొనసాగుతుందని టిడిపి రాష్ట్ర నాయకులు మబ్బుదేవ నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో బుధవారం మీడియా ముందు ఆదివారాహిశక్తి రాష్ట్ర అధ్యక్షులు మహారుద్ర వారాహి స్వామి, శివశంకర్ ప్రసాద్, శ్రీరాములు తదితరులతో కలిసి మబ్బుదేవనారాయణ రెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలుతో జరుగుతున్న నష్టాల్ని ఆధ్యాత్మికంగా ఆపడానికి ఈ రథయాత్రను జరుపుతున్నట్లు తెలియజేశారు. 22వ తేది మొదటి రోజు జీవకోన ఆలయం నుండి మొదలై నగర పురవీధుల్లో ఈ రథయాత్ర సాగుతుందని తెలిపారు.

## స్విమ్స్‌లో వినాయక చవితి సందర్భంగా ఓపి, ఓటిలకు సెలవు

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త

స్విమ్స్‌లో వినాయక చవితి పండుగ సందర్భంగా ఈ నెల 7వ తేదీ శనివారం ఓపి, ఓటిలకు సెలవు దినంగా ప్రకటించారు. స్విమ్స్ అత్యవసర విభాగపు సేవలు యధాతధంగా కొనసాగుతుందని స్విమ్స్ సంచాలకులు, ఉప కులపతి డా. ఆర్‌వి కుమార్ తెలిపారు.

## ప్రశాంత వాతావరణంలో వినాయకచవితి ఉత్సవాలు :సిఐ



**చంద్రగిరి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** చారిత్రాత్మక చంద్రగిరిలో హిందువుల మొదటి పండుగ వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని సిఐ సుబ్బరామిరెడ్డి అన్నారు. చంద్రగిరి సిఐగా బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల విధుల నిమిత్తం ఇక్కడికి బదిలీపై వచ్చిన సిఐ రామయ్య తిరుపతి ఎస్వీ యూనివర్శిటీ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నగిరి రూరల్ సిఐగా పనిచేస్తున్న సుబ్బరామిరెడ్డి చంద్రగిరికి బదిలీపై వచ్చారు. నూతన సిఐ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో పలువురు రాజకీయ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, స్టేషన్ అధికారులు, సిబ్బంది ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.

## వర్షాకాలంలో కాయగూరలపై తెగుళ్ళ ప్రభావం

చంద్రగిరి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:



వర్షాకాలంలో కాయగూరల పంటలపై తెగుళ్ళ ప్రభావం అధికంగా వుంటుందని ఉద్యానవన మండల అధికారి శైలజ అన్నారు. మండల పరిధిలోని దోర్నకంబాల పంచాయతీలో బుధవారం ఆమె కాయగూరల తోటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వర్షాల కారణంగా ఆకుమచ్చ తెగులు, బూజు తెగులు, కాయ కళ్ళు తెగులు ఉధృతి అధికంగా వుంటుందన్నారు. ఈ నేపధ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులు కాయగూరలు, పూలతోటలను తప్పనిసరి డ్రిప్ పద్దతిలో సాగు చేయాలన్నారు. తద్వారా 35 నుండి 40 శాతం అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో కాయగూరల సాగుకు 2.50 ఎకరాలకు రూ.20 వేలు, పూల సాగుకు రూ.16 వేలు సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. లేత మామిడి, ఇతర తోటలలో అంతర పంటలుగా సాగు చేసి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. మరిన్ని వివరాలకు రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని కోరారు.

## కోదండరామ స్వామి కుంభాభిషేకంలో ఎమ్మెల్యే



**నగరి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** నగరి మున్సిపాలిటీ కీళపట్టు కాలనీలో కోదండరామ స్వామి ఆలయ కుంభాభిషేకంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యేని శాలువలతో సత్కరించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## విద్యా ప్రమాణాలు మెరుగు పరచుకోవాలి

నగరి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:



విద్యా ప్రమాణాలు మెరుగు పరచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేణుగోపాల్ అన్నారు. నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి పొందిన తరువాత బుధవారం నిర్వహించిన తొలి అకడమిక్ కౌన్సిల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ కళాశాల నాణ్యతా ప్రమాణాలను అభివృద్ధి చేసిన విధానాన్ని అకడమిక్, పరిశోధన, పరిపాలనా రంగాల్లో కళాశాల అనుసరించిన విధానాలను వివరించారు. కళాశాల నాక్‌లో ఏ ప్లస్‌గ్రేడ్ సాధించిన విధానాన్ని స్వయం ప్రతిపత్తి పొందిన విధానాన్ని వివరించారు. ఈ సమావేశానికి అకడమిక్ కౌన్సిల్ సభ్యులుగా యూనివర్సిటీ చేత నియమించబడిన సభ్యులు వాణిజ్య శాస్త్రం ప్రొఫెసర్ వెంకటేశ్వరులు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుపరడటానికి యువత కృషి చేయాలని, విద్యార్థులను చైతన్యవంతులను చేసి ఉన్నత స్థానాలకు చేరడానికి కావలసిన ప్రేరణను అందించాలని సూచించారు. ప్రొఫెసర్ రాజేశ్వరమ్మ మాట్లాడుతూ నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో కళాశాల ఐక్యూ కో-ఆర్డినేటర్ ఇందిరా ప్రియదర్శిని, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎక్సమినేషన్స్ డా. వేణుగోపాల్, అకడమిక్‌కో-ఆర్డినేటర్ డా. మహేశ్వరి, కళాశాలలోని అన్ని విభాగాల అధ్యక్షులు పాల్గొని 2024-25 విద్యా సంవత్సరం అమలు చేయబోయే కరిక్యులం, ఉప కరిక్యులం తదితర కార్యక్రమాల గురించి చర్చించి తీర్మానాలను ఆమోదించారు.

## అటవీ సంరక్షణ నిబంధనలు పాటించాలి



**వడమాలపేట, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** అటవీ సంరక్షణ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని పుత్తూరు అటవీ బీట్‌అధికారి గంగులయ్య తెలిపారు. బుధవారం బట్టీ కండ్రిగ యానాది కాలనీలో ప్రజలకు అవగాహన కల్పించారు. గతంలో కొన్నేళ్లుగా అటవీ భూములు సాగుచేసుకుంటున్నామని, ఇప్పటికి ఎలాంటి ఆధారాలు లేవని యానాదులు విన్నవించారు. సంబంధిత భూములను పరిశీలించారు. ఉన్నతాధికారులకు తెలుపుతామని తెలిపారు. అటవీ సంపదను కాపాడాలని, అటవీ జంతువుల వేట నిషేధమని, వ్యతిరేకిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అమ్మవారి గుడి ప్రతిష్టను కాపాడండి



**రేణిగుంట, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** శ్రీశ్రీశ్రీ కట్టపుట్టాలమ్మ గుడి ప్రతిష్టను కాపాడాలని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కురకాలువ వాసు అభ్యర్థించారు. రేణిగుంట మండలం కరకంబాడి శ్రీ కట్ట పుట్టాలమ్మ దేవస్థానం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వంశ పారంపర్య ధర్మకర్త వాసు మాట్లాడుతూ కొంత మంది కావాలని పని కట్టుకునఇ దేవాలయ వ్యవస్థలో రాజకీయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 40 సంవత్సరాలుగా ఆరు తరాల తమ కుటుంబానికి చెందిన వారు దేవాలయానికి ధర్మకర్తలుగా ఉన్నారన్నారు. అమ్మవారి సేవలో ఉంటూ ఆలయ ఆదాయాన్ని కోటిన్నర రూపాయలకు పెంచామన్నారు. కొంత మంది దేవాలయంలో కావాలని అలజడి సృష్టిస్తున్నారన్నారు. గ్రామంలోని కొంత మంది వంశపారంపర్య ధర్మకర్తలైన తండ్రి కురకాలువ రామచంద్రయ్య తన అనుమతి లేకుండా జాతరకు చాటింపు వేశారని బాధను వ్యక్తం చేశారు. దేవాలయం పేరుతో ఉన్న కోటి రూపాయల సొమ్ము స్వాహా చేయడానికి ఎత్తులు వేస్తున్నారన్నారు. గ్రామస్తులు, వంశపారం పర్య ధర్మకర్తల అనుమతులు లేకుండా చాటింపు వేయడాన్ని తప్పు పట్టారు. గతంలో కూడా కొంత మంది హుండీలు కోసిన విషయాన్ని గుర్తు చేస్తూ అప్పట్లో కేసులు నమోదయ్యాయన్నారు. అదే విధంగా రాత్రి కూడా వచ్చి హుండీలు కోశారన్నారు. తక్షణం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దేవాలయానికి ఆదాయం ఎక్కువన్నందు వల్ల ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్‌లో కలపాలని ఎమ్మెల్యేను కోరారు.

## ఇన్‌చార్జి కార్యదర్శిని నియమించిన అధికారులు

**రేణిగుంట, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** రేణిగుంట పంచాయతీకి కార్యదర్శి కొరత అనే శీర్షికతో బుధవారం ప్రచురితమైన వార్త కథనానికి అధికారులు స్పందించారు. ఈ నెల 15వ తేదీ వరకు అధికారుల బదిలీ బ్యాన్ ఉండడం వల్ల రేణిగుంట పంచాయతీకి కార్యదర్శిని బదిలీ చేయలేకపోతున్నామని ఇన్‌చార్జి డీపీవో సుశీలదేవి తెలిపారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు బ్యాన్ ఎత్తేసిన మరుక్షణం నూతన కార్యదర్శిని బదిలీపై పంపుతామన్నారు. అప్పటి వరకు పరిపాలన వ్యవస్థ కుంటు పడకుండా ఇన్‌ఛార్జి కార్యదర్శి నియమిస్తామన్నారు. ఎంపీడీవో విష్ణు చిరంజీవి స్పందిస్తూ రెగ్యులర్ కార్యదర్శి వచ్చే వరకు ఇన్‌చార్జి కార్యదర్శిగా వెంకటాపురం కార్యదర్శి బాల సుబ్రహ్మణ్యంరెడ్డిని నియమించామని తెలిపారు.

## వినాయక చావిళ్ళకు అనుమతి తప్పనిసరి : సీఐ శరత్‌చంద్ర

రేణిగుంట, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:



రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయక విగ్రహాలు చావిళ్ళకు(మండపాలు) తప్పని సరిగా సింగిల్‌విండో విధానంలో అనుమతులు తీసుకోవాలని అర్బన్ సీఐ శరత్‌చంద్ర అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వినాయక విగ్రహాల ప్రతిష్టించే చావిళ్ళకు ప్రతిష్టాత్మకంగా సింగిల్‌విండో విధానాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవడానికి ఇప్పటి వరకు అగ్నిమాపక, పంచాయతీ, పోలీసు శాఖ నుంచి అనుమతులు తీసుకోవాల్సిన అవసరం ఉండేదన్నారు. అనుమతులను సులభతరం చేయడానికి ప్రభుత్వం సింగిల్‌విండో క్లియరెన్స్ విధానాన్ని ఆన్‌లైన్‌లో అమల్లోకి తెచ్చిందన్నారు. వివరాలు కావాలనుకుంటే అర్బన్ సీఐ మొబైల్‌నెం.9491074540, అర్బన్ ఎస్ఐ 9440796765లను సంప్రదించాలన్నారు.

